క్లుప్తంగా

వెంకన్న ఆలయానికి కౌంటింగ్ యంత్రం



బిజినేపల్లి: మండలంలోని పాలెం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి తాడూర్ మండలం సిర్సవాడకు చెందిన జున్న బస్విరెడ్డి, మాధవి దంపతులు శుక్రవారం నోట్ల లెక్కింపు యంత్రాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ జున్న శేఖర్‌రెడ్డి నోట్ల లెక్కింపు యంత్రాన్ని అందుకున్నారు. అనంతరం వారికి ఆలయం తరఫున ప్రత్యేకంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం



తాడూరు: రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామని సింగిల్‌విండో చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం సింగిల్‌విండో కార్యాలయం ఆవరణలో సిబ్బంది, డైరెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సేవలు అందించడంలో సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని కోరారు. ఎరువులు వాడకం, విత్తనాలు వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం యూరియా అందుబాటులో ఉందని దాదాపు 45 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను పంపిణీ చేశామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సీఈఓ ఆంజనేయులు, ఆయా గ్రామాల డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాధుల మట్టి తరలిస్తున్నారని ఫిర్యాదు



బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని ఆవంచలో సమాధుల మట్టి తరలిస్తున్నారని గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు శుక్రవారం తహసీల్దార్ జేకే మోహన్‌కు ఫిర్యాదు చేశారు. మట్టిన తవ్విన ప్రాంతంలో సమధి చేసిన పూర్వీకుల ఎముకలు బయటపడుతున్నాయని వివరించారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న మారేపల్లి గ్రామానికి చెందిన బొర్ర రాజశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం నాయకులు జంగయ్య, శ్రీశైలం కోరారు.

విద్యుత్‌షాక్ గురై గేదె మృతి

వెల్దండ: మండలంలోని కొట్ర గ్రామానికి పోనుగోటి నవీన్‌రావు సంబంధించిన పాడి గేదె శుక్రవారం వ్యవసాయ పొలం వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందింది. స్థానికుల వివరాల ప్రకారం వ్యవసాయ పొలంలో గేదె మేస్తుండగా విద్యుత్‌స్తంభానికి ఉన్న తీగను తగిలింది. దీంతో గేదె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ దాదాపుగా రూ.80వేలు వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

ఎమ్మార్పీ ధరలకే విత్తనాలు విక్రయించాలి



చారకొండ: ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏఓ చిన్నా హుస్సేన్ హెచ్చరించారు. మండల కేంద్రంలో శుక్రవారం విత్తన డీలర్లతో ఆయన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్టాక్ బోర్డులో వివరాలు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో ఎవరైన ఎలాంటి అనుమతి లేకుండా లూజ్ విత్తనాలు, నకిలీ విత్తనాలు అమ్మితే వ్యవసాయ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఆయా గ్రామాల విస్తరణ అధికారులు, డీలర్లు ఉన్నారు.

మంత్రిని కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు

కల్వకుర్తి టౌన్: రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మను కల్వకుర్తి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కల్వకుర్తి ప్రాంతంలో ఉన్న ఆస్పత్రులతో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిని కలిశారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పట్టాలెక్కని పాలన

- నిలిచిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు
- గురువారంతో ముగిసిన ఎన్నికల కోడ్



నిలిచిన అచ్చంపేట మున్సిపల్ భవన నిర్మాణ పనులు

అచ్చంపేట: ఎన్నికల యుద్ధం ముగిసింది.. ప్రజలు తమ అభిమాన నేతలకు పట్టం కట్టారు. ఈ నెల 4న మంగళవారం ఓట్ల లెక్కింపుతో ఈ విషయం తేలిపోగా.. గురువారం ఎన్నికల కోడ్‌కు తెరపడింది. వరుసగా ఎన్నికల కోడ్ అమలుతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలతో పాటు ప్రజల పనులు అటకెక్కాయి. అసెంబ్లీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అక్టోబరులో మొదలై డిసెంబరులో ముగిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన కొన్ని నెలల వరకు పాలకులు, అధికారులు పాలనపై దృష్టి సారించగా.. అంతలోనే ఎమ్మెల్సీ, సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చింది. ఈ నెల 6న రాష్ట్రంలో అది కూడా ముగియడంతో ప్రభుత్వ పాలన పట్టాలెక్కనుంది.

గతేడాది అక్టోబర్‌లో మొదలు..

రాష్ట్రంలో గతేడాది అక్టోబరు నుంచి ప్రారంభమైన అసెంబ్లీ ఎన్నికల కోడ్ డిసెంబర్ 5 వరకు సుమారు 2 నెలల పాటు కొనసాగింది. అనంతరం ఫిబ్రవరి 26న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో కోడ్ అమలులోకి వచ్చింది. మార్చి 28న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ కోడ్ అమలులో ఉండగానే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మార్చి 16 నుంచి జూన్ 6 వరకు కోడ్ అమలవుతోంది. శాసనసభ ఎన్నికలు ముగిసిన తర్వాత 2 నెలల 20 రోజులు మినహా మిగతా కాలం కోడ్ ఉంది. అసెంబ్లీ మొదలు లోక్‌సభ ఎన్నికలు ముగిసే వరకు సుమారుగా 8 నెలల్లో 5 నెలలు కోడ్ అమల్లో ఉండటంతో ప్రభుత్వం చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు నిలిచిపోయాయి.

నిలిచిన ప్రజావాణి..

జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల విధుల్లో నిమగ్నమవడంతో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నిలిచిపోయింది. ప్రజా సమస్యలు పేరుకుపోయాయి. ఇప్పటికే వర్షాలు ప్రారంభమైన దశలో మిగిలిపోయిన సాగునీటి, పారిశుద్ధ్య పనులు పూర్తి చేయాల్సి ఉంది.

రూ.54.93 కోట్ల పనులపై నీలినీడలు

అచ్చంపేట మున్సిపల్ అభివృద్ధి పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో 20 వార్డుల్లో 73 పనులకు గాను స్పెషల్ డెవలప్‌మెంట్(ఎస్‌డీఎఫ్) తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్ఐడీసీ) కింద రూ.54.93 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల్లో కొన్ని పనులు ప్రారంభం కాగా.. చాలా పనులు ఇంకా ప్రారంభించలేదు. పట్టణంలోని ప్రధాన రహదారిలోని మూడు కల్వర్టుల నిర్మాణానికి రూ.కోటిన్నర నిధులు మంజూరు కాగా.. టెండర్ దక్కించుకున్న కంట్రాక్టర్ ఇంకా పనులు ప్రారంభించలేదు. ప్రతిపాదించిన పనులు ప్రారంభించకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉంది.

ఇప్పటికే మంజూరైన పనులు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా మందకొడిగా సాగుతున్నాయి.

హామీల అమలుకు కసరత్తు

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అముల చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే కొన్నింటిని నేరవేర్చగా.. ఎన్నికల కోడ్ కారణంగా ఈ ప్రారంభానికి నోచుకోని సంక్షేమ పథకాలు పట్టాలెక్కాల్సి ఉంది. గృహజ్యోతికి సంబంధించి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సిలిండర్లు, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలు అమలు చేయాల్సి ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో గృహజ్యోతి, ఉచిత సిలిండర్లు పథకాలు నిలిచిపోయాయి. కోడ్ ముగియడంతో ప్రస్తుతం పట్టాలెక్కే అవకాశం ఉంది. ఆగస్టు 14లోపు రైతులకు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇదివరకే ప్రకటించారు. పింఛన్ల పెంపు, కొత్త రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఎన్నికల కోడ్ ముగియడంతో పూర్తిస్థాయిలో అభివృద్ధి, సంక్షేమంపై సర్కారు దృష్టి సారించనుంది.

నిధులున్నా.. ప్రగతి నామమాత్రమే

కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన కొన్ని రోజులకే అభివృద్ధి పనులు చేపట్టేందుకు సీఎం ప్రత్యేక నిధుల నుంచి శాసనసభ నియోజవర్గాలకు రూ.10 కోట్ల చొప్పున మంజూరు చేశారు. వీటిలో రూ.2 కోట్లను ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, రూ.కోటిని తాగునీటి అవసరాలకు వినియోగించాలని ప్రభుత్వం సూచించింది. ఈ నిధులకు సంబంధించి పనులు అంచనాల దశలోనే ఉన్నాయి. ఎన్నికల సంఘం అనుమతితో తాగునీరు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన వంటి పనులు మాత్రమే కొనసాగుతున్నాయి. ఎన్నికల కోడ్ ముగియగానే ఆయా జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేల పర్యవేక్షణలో పూర్తిస్థాయిలో పనులు కొనసాగనున్నాయి.

అసంపూర్తిగా బీటీ నిర్మాణ పనులు



కాంసానిపల్లిలో బురదమయంగా మారిన రోడ్డు

ఉప్పునుంతల: మండల కేంద్రం వరకు వంగూరు వరకు 17 కిలోమీటర్ల మేర బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి సీఆర్ఆర్ కింద రూ. 18 కోట్లు నిధులు మంజూరయ్యాయి. మండల సరిహద్దులోని దుందుబీ వాగుపై చింతపల్లి పల్లి బ్రిడ్జి నుంచి ఉప్పునుంతల మండల కేంద్ర వరకు ఇటీవల వేసిన బీటీ డబుల్ రోడ్డు పనులు పూర్తయ్యాయి. కాని కాంసానిపల్లి, ఉప్పునుంతల గ్రామాల్లో పనులు చేపట్టకపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు వేయాల్సి ఉంది. ప్రస్తుతం గ్రామాల్లో పాతరోడ్డు పూర్తిగా ధ్వంసమై వర్షపు నీరు గోతుల్లో నిలిచి బురదమయంగా మారింది. అదేవిధంగా కాంసానిపల్లి నుంచి ఉప్పునుంతల వరకు ఐదు కిలోమీటర్ల మేర కొత్తగా వేసిన బీటీ రోడ్డు సరిగా వేయకపోవడంతో ఎగుడుదిగుడు రోడ్డుపై వెళ్లడానికి వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ వంతకు గంతేసినట్లు రోడ్డు పనులు చేసి చేతులు దులుపుకున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టింపు లేకుండ వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. అచ్చంపేట నియోజకవర్గ కేంద్రం నుంచి ఉప్పునుంతల మండలకేంద్రం మీదుగా సీఎం రేవంత్‌రెడ్డి సొంతూరు నుంచి హైదరాబాద్ వెళ్లే ఈ రోడ్డు పనులపై అధికారులు సోయిలేకుండ వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధతో గ్రామాల్లో అసంపూర్తిగా వదిలిసేసిన సీసీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేయించాలని, సరిగా వేయని బీటీ రోడ్డుపై మరోసారి బీటీ కోటింగు వేయించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ లక్ష్మీపతిని వివరణ కోరగా బీటీ నిర్మాణ పనులకు సీఆర్ఆర్ కింద రూ. 18 కోట్లు మంజూరు అయ్యాయి. జీఎస్టీ 12 నుంచి 18 శాతానికి పెంచడంతో గ్రామాల్లో సీసీ రోడ్లు వేయడానికి నిధులు సరిపోక ఆయా గ్రామాల్లో కొంత దూరం రోడ్డు పనులు వదిలిపెట్టాం. మిగిలిన సీసీ రోడ్ల కోసం తిరిగి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరీకాగానే ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు వేయిస్తామని ఏఈ తెలిపారు.

గృహజ్యోతి పథకం అమలు



దోమలపెంట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం శుక్రవారం దోమలపెంటలో విద్యుత్‌శాఖ శాఖ సిబ్బంది హాజీబాబా, హనుమంతు, ఎంపీటీసీ మల్లికార్జున ప్రారంభించారు. 200 యూనిట్లు లోపు ఉన్నవారికి ఉచిత కరెంట్ మంజూరు చేస్తుందని ఎంపీటీసీ తెలిపారు. స్థానికంగా 222 కుటుంబాలకు ఈ పథకం అమలు అయ్యిందని పేర్కొన్నారు. ఇంకా దరఖాస్తు చేసుకోని లబ్ధిదారులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పంచాయతీ సెక్రెటరీ జయంత్, నాయకులు ముత్తుస్వామి కుమార్, రవికుమార్‌గౌడ్, ఇజాజ్, దత్తు, సిరాజ్, అచ్చలయ్య పాల్గొన్నారు.

పనుల పరిశీలన



చారకొండ: మండలంలోని మర్రిపల్లిలో ఎంపీపీఎస్ పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల నిధులు నుంచి రూ.25 వేలు మంజూరుకావడంతో మరమ్మతు పనులు చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం శుక్రవారం ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ పనులను పరిశీలించారు. అనంతరం నర్సరీని సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రవి శంకర్ తదితరులు ఉన్నారు.

కొల్లాపూర్‌లో 11.4 మి.మీ వర్షపాతం

కొల్లాపూర్: పట్టణంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు వర్షం కురిసింది. 11.4 మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు పేర్కొన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా చెరువుల్లోకి వర్షపు నీరు అధిక మోతాదులో చేరుకుంది. వాగులు ప్రవహించాయి. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు నిలిచి రోడ్లు బురదమయంగా మారాయి.

మౌలిక వసతులు కల్పిస్తాం

వెల్దండ: పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, ఎంఈఓ శంకర్‌నాయక్‌లు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలు పునః ప్రారంభానికి విద్యార్థులకు మూత్రశాలలు, మరుగుదొడ్ల, తలుపులు, కిటికిలకు మరమ్మతు చేయాలని ఆదేశించారు. పాఠశాలలకు మంజూరైన రూ.25వేలతో పాఠశాలల్లో మరమ్మతు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మరమ్మతు పనులపై నివేదికలను అధికారులకు ఉపాధ్యాయులు అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ హెచ్‌హెంలు, విద్యా కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

తండాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సున్నపుతండా, బోడబండ తండాలలో కొల్లాపూర్ ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకొన్నారు. 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగిరెడ్డి తెలిపారు. ఎస్ఐ అరుణ, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



సాక్షి, నెట్‌వర్క్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శుక్రవారం కొల్లాపూర్ మండలంలోని సోమశిలో, తాడూరు మండల కేంద్రంతో పాటు ఐతోల్‌లో, అచ్చంపేట మండలం సింగారం, వెల్దండ మండలంలోని పెద్దాపూర్, తుంకిబండతండా, నారాయణపూర్‌తండా, కలిమిరాళ్లతండా బడిబాట నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీలు నిర్వహించారు. రాజశేఖర్, ఆనంద్‌రెడ్డి, కృష్ణ, భాస్కర్, శ్రీకాంత్,రామూర్తి తదితరులు ఉన్నారు.

క్షయ నివారణపై అవగాహన



అన్నారంలో క్షయ నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: మండలంలోని అన్నారం, కేతేపల్లి, మాందాపూర్ గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి వేళల్లో జ్వరం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం, రాత్రి వేళల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్న వారు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకొని వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. దీంతో పాటు బలవర్ధకమైన ఆహారం కోసం వ్యాధి నిర్ధారణ అయిన వారికి మందులు వాడినన్ని రోజులు ప్రతి నెల రూ.500 చెల్లిస్తారని తెలిపారు. టీబీ వ్యాధి ఉన్న వారు మద్యం, పొగ తాగడం మానేయాలన్నారు. ఆయా గ్రామాల్లో సర్వే చేసి అనుమానితుల నుంచి తెమడ పరీక్షల నిమిత్తం శ్లైనను సేకరించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ మైథిలి, వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, శ్రీలక్ష్మి, రేవతి, ఆశా కార్యకర్తలు కవిత, చిన్నమ్మ, ప్రమీల, భాగ్యమ్మ, సువర్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యవర్గం.. ఏకగ్రీవం

వీపనగండ్ల: మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. 250 మంది ఉన్న సంఘ సభ్యులు ఉన్న ఈ సహకార సంఘానికి 9 మంది డైరెక్టర్లను ఎన్నుకోగా శుక్రవారం అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా ఎస్ వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా ఎస్ వెంకటయ్య, కోశాధికారిగా సీహెచ్ సాయిబాబాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జిల్లా అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాసులు తెలిపారు.

పాన్‌గల్‌లో భారీ వర్షం

పాన్‌గల్: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈనెలలో ఇప్పటి వరకు కురిసిన వర్షాల్లో ఇదే భారీ వర్షం. దీంతో రోడ్లన్నీ జలయమంగా మారాయి. గంట పాటు కురిసిన వర్షానికి పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న రోడ్డుపై వర్షపు నీరు, గుట్టపై నుంచి వచ్చే వరదతో నీరు అధికమై స్టేషన్ ఆవరణలోకి వర్షపు నీరు చేరింది. మండల కేంద్రంతో పాటు అన్నారం, గోప్లాపూర్ గ్రామాల్లో కూడా భారీ వర్షం కురవడంతో చెరువులు, కుంటలకు వరద నీరు చేరింది. సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్‌కు వినతి



కల్వకుర్తిరూరల్: ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జిల్లెల్ల చిన్నారెడ్డిని పట్టణానికి చెందిన ప్రగతి ఫౌండేషన్ చైర్మన్ ఆరీఫుద్దీన్ శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలను చిన్నరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. స్వచ్ఛంద సేవా సంస్థలకు ఎల్లప్పుడు సహకరిస్తానని చిన్నారెడ్డి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. రహమాన్, షాకీర్ ఉన్నారు.

బురదమయంగా అమరగిరి రోడ్డు



అమరగిరి రోడ్డుపై నిలిచిన నీరు

కొల్లాపూర్ రూరల్: మండల జలోని అమరగిరి గ్రామానికి చెందిన రోడ్డు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారింది. కృష్ణానదికి సమీపంలో ఉన్న అమరిగిరి గ్రామానికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నడిచేందుకు కూడా వీలులేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో భక్తుల పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

అమ్రాబాద్: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో శుక్రవారం కన్యకాపరమేశ్వరిదేవికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్రాబాద్, పదర మండలాల ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి డోలాహారణ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించారు. ఉదయం అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదవితరణలు చేశారు. భక్తులు అమ్మవారిని అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆర్యవైశ్యమహిళా సంఘం మండల అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, సాంబుశోభ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



లింగాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు



వెల్దండ రాఘయపల్లిలో ..

వెల్దండ: మండలంలోని రాఘయపల్లి, చౌదర్‌పల్లి, తదితర గ్రామాల్లో ఫర్టిలైజర్, పెస్టిసైట్ దుకాణాలను ఏఓ మంజుల తనిఖీ చేశారు. గ్రామాల్లో లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలో ఏఈఓలు, డీలర్లు తదితరులు ఉన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఏఓ నాగార్జునరెడ్డి తనిఖీ చేశారు. ఏఈఓలు తమ క్లస్టర్ల పరిధిలోని షాపులను సందర్శించారు. కొనుగోలు చేసిన రైతులకు వెంటనే రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈఓలు చీన్యానాయక్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు యూనిఫాం పంపిణీ



ఉప్పునుంతలలో యూనిఫాం అందజేస్తున్న ఎంఈఓ రామారావు



చారకొండలో..

ఉప్పునుంతల: పాఠశాలలల పునఃప్రారంభం సందర్భంగా శుక్రవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ రామారావు మండలంలోని కొన్ని పాఠశాలకు ఏకరూప దుస్తులను అందజేశారు. పెద్దాపూర్, మొల్గర, కొత్తరాంనగర్, ఫిరట్వానిపల్లి, రాయిచెడ్, గట్టుకాడిపల్లి, పూర్యానాయక్ తండా, సీబీ తండా పాఠశాలల హెచ్‌ఎంలకు దుస్తులను అప్పగించారు. కార్యక్రమంలో డీపీఎం శ్రీనివాసులు, ఐకేపీ ఏపీఎం సైదులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల కుట్టు మహిళ సమైఖ్య సంఘం సభ్యులకు అప్పగించడంతో వాటిని పూర్తి చేసి 1169 మంది విద్యార్థులకు అవసరమగు దుస్తులను శుక్రవారం మండల విద్యాధికారి శంకర్ నాయక్‌కు ఎంపీఎం బాలచందర్ అందజేశారు. ఎంఈఓ శంకర్ నాయక్ మాట్లాడుతూ పాఠశాలల వారిగా ఏకరూప దుస్తులను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, సీఆర్పీ యాదయ్య, మహిళా సభ్యులు ఉన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో పాఠశాలలకు ఏకరూప దుస్తువులు అందజేశారు. ఐకేపీ బీపీఎం వెంకటేష్‌తోపాటు ఎంఈఓ చంద్రుడు మహిళా సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. 10 పాఠశాలలకు సంబంధించిన 468 మంది విద్యార్థుల ఏకరూప దుస్తువులను ఎంఈఓ హెచ్‌ఎంలకు అందజేశారు. కార్యక్రమంలో డీపీఎం వెంకటేష్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మహిళా సమైక్య ఏపీఎం నిరంజన్, సీసీ సుజాత, మమత, నిరంజన్, మహిళా సంఘాల సభ్యులు భాగ్యలక్ష్మి, విజయ, ప్రసన్న, నికిత, హెచ్‌ఎంలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ, మంగనూర్, గౌరారం, శ్రీవాణి విద్యాలయం, వట్టెం పాఠశాలలకు జిల్లా డీపీఎం అరుణాదేవి సమక్షంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు యూనిఫాం అందజేశారు. మొత్తం 524 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేశారు. ఏపీఎం రజిత, ఉన్నారు.

లింగాల: మండల విద్యా వనరుల కేంద్రంలో పలు పాఠశాలలకు మండల విద్యాధికారి చంద్రుడు యూనిఫాం పంపిణీ చేశారు. లింగాల, జీల్గుపల్లి, బాకారం, రాంపూర్, కేసీ తండా, ఎంసీ తండా, మగ్దూంపూర్, మానాజీపేట పాఠశాలలకు చెందిన 98 మంది విద్యార్థులకు సంబంధించి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు యూనిఫాం అందజేశారు. ఎంపీడీఓ ఆంజనేయులు, ఏపీఎం బాలస్వామి, హెచ్‌ఎంలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



తెలకపల్లిలో..



బిజినేపల్లిలో..